క్లుప్తంగా

కోలాహలంగా ప్రభ ఊరేగింపు



ప్రభ ఊరేగింపులో పాల్గొన్న యువకులు

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామ శివారు తోటమెరకలో కొలువుదీరిన పెద్దింట్లమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం ప్రభ ఊరేగింపు కోలాహలంగా జరిగింది. గరగ నృత్యాలు, బుట్ట బొమ్మల ప్రదర్శన, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ ప్రభ ఊరేగింపు ఆద్యంతం కన్నుల పండువలా జరిపించారు. భక్తులు రెట్టించిన ఉత్సాహంతో ఊరేగింపులో పాల్గొన్నారు. నెల రోజుల పాటు జరిగే అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగింది. వేద మంత్రాలు, భక్తుల కోలాహలం, ఆధ్యాత్మిక కార్యక్రమాల నడుమ ఈ కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. ఈ నెల 26న అమ్మవారి జాతర జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా సత్యనారాయణ

మామిడికుదురు: కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా నగరం గ్రామానికి చెందిన నీతిపూడి బాలసత్యనారాయణ నియమితులయ్యారు. పార్టీ అధిష్టానం నుంచి ఆదేశాలందాయని ఆయన గురువారం తెలిపారు.

మంచినీటి పథకం పరిశీలన

అంబాజీపేట: మాచవరం శివారు కామయ్యకోడులో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని క్వాలిటీ కంట్రోల్ డీఈలు వెంకటేశ్వరరావు, ప్రభాత్ గురువారం పరిశీలించారు. పథకం నిర్మాణం, నాణ్యత, కొలతలు తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మాణాలను తనిఖీ చేశారు. ఈ నివేదికను ఈఎన్‌సీ కార్యాలయానికి అందజేస్తామని అధికారులు తెలిపారు. రూ.2.50 కోట్లతో నిర్మించిన వాటర్ ట్యాంకులు, బెడ్లు, పైపులైన్లు, వాటి పనితీరు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వీరి వెంట డీఈఈలు ఎ.పద్మనాభం, ఏఈలు సందీప్, రాజేష్, జేఈ చలమయ్య తదితరులున్నారు.

ఘనంగా రాములోరి విగ్రహ పునః ప్రతిష్ఠ

ఆలమూరు: పెదపళ్లలో ఉన్న తూర్పు వీధి రామాలయంలో శ్రీహనుమత్ లక్ష్మణ సమేత సీతారామచంద్రమూర్తి నూతన శిలా విగ్రహ పునః ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. మూడు రోజులుగా జరుగుతున్న ప్రతిష్ఠాపన పూజలు గురువారం ముగిశాయి. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై, దేవతామూర్తుల విగ్రహాలను దర్శించుకున్నారు. సుమారు పది వేల మందికి భారీ అన్న సమారాధన జరిగింది. విగ్రహ ప్రతిష్ఠాపనకు సహకరించిన వ్యాపారవేత్త వంటిపల్లి పాపారావును ఆలయ కమిటీ సత్కరించింది.

యోగాతో ఆరోగ్యానికి మేలు

పి.గన్నవరం: ఆరోగ్యానికి యోగాతో ఎంతో మేలు చేకూరుతుందని యోగా గురువు ఎ.శ్రీనివాస్ అన్నారు. పప్పులవారిపాలెం గ్రామంలో మహిళలకు ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ప్రాముఖ్యాన్ని వివరించారు. వయసు తారతమ్యం లేకుండా అందరూ యోగా చేయవచ్చన్నారు. యోగాతో శారీరక, మానసిక రుగ్మతలు దూరమై, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. మహిళలకు ఆరోగ్యపరంగా వచ్చే ఇబ్బందులను యోగాతో అధిగమించవచ్చన్నారు.

కాండం తొలిచి.. నడ్డి విరిచి..

- వరిపై కాండం తొలుచు పురుగు దాడి
- నివారణ చర్యలు చేపట్టాలంటున్న వ్యవసాయ నిపుణులు

అంబాజీపేట: వరి పైరుపై కాండం తొలుచు పురుగు అధికంగా కనిపిస్తోందని, రైతులు గమనించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాండం తొలుచు పురుగు ఆశించిన వరి చేలల్లో 30 శాతం వరకు నష్టం కలుగుతుందని తక్షణమే నివారణ చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు.

మూడు నియోజక వర్గాల్లో మొత్తం 50,093 ఎకరాల్లో వరి సాగవుతోంది. పి.గన్నవరం నియోజకవర్గంలో 22,384, కొత్తపేట నియోజకవర్గంలో 18,322, రాజోలు నియోజకవర్గంలో 9,387 వేల ఎకరాల్లో రబీ సాగు జరుగుతోంది. ప్రస్తుతం దాళ్వా పంట పొట్ట పోసుకునే దశలో ఉంది.

పురుగు లక్షణాలు

పసుపు రంగు కాండం తొలుచు పురుగు, ఆడ రెక్కల పురుగు గడ్డిరంగులో ఉండి, ముందు జతరెక్కల మధ్యలో నల్లటి మచ్చ కలిగి ఉంటుంది. కందిగింజ పరిమాణంలో ఉండి, గుడ్ల సముదాయాలను ఆకు చివర భాగాన పెడుతుంది. ఒక్కొక్క గుడ్ల సముదాయంలో 50–80 గుడ్లు ఉండి, గోధుమ రంగు వెంట్రుకలు కప్పబడి రక్షణ పొందుతాయి.



కాండం తొలుచు పురుగు ప్రభావంతో ముక్కామలలో నాశనమైన వరి పంట

పంట నాశనం ఇలా..

గుడ్లు 5–8 రోజుల్లో పొదగబడి, లార్వాలు బయటకు వస్తాయి. వాటి నోటి నుంచి వెలువడే తీగలాంటి లాలాజలం సహాయంతో కాండం కిందకు వేలాడి, నీటి ఉపరితలం వద్ద వరికాండానికి రంధ్రాలు చేసి, లోపలకు ప్రవేశిస్తాయి. ఇవి 4–7 దశల్లో పెరిగి, కాండం మొదలుకు చేరుకుని, ప్యూపా దశకు చేరుకుంటాయి. తొలి దశలో లార్వాలు ఆకు చివరన గోకి తినడం వల్ల ఆ ప్రదేశంలో వెడల్పాటి తెల్లటి చారలు ఏర్పడతాయి. తర్వాత లార్వాలు కిందకు వేలాడి, కాండం కణుపు వద్ద రంధ్రం చేసి, లోపలకు ప్రవేశించి.. కొరికి తినడం వల్ల మొవ్వు భాగం చనిపోతుంది. అలాగే అతిగా ఎరువులు, పురుగు మందుల వినియోగం వల్ల పంటకు నష్టం వాటిల్లుతుంది. వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎరువులను, పురుగు మందులను వినియోగించడం వల్ల పంట దిగుబడి అధికంగా వస్తుంది.

తెల్లకంకి వచ్చే అవకాశం!



వరిలో చిరుపొట్ట దశలో కార్బోసిరాన్ 3జీ గుళికలు పది కిలోలు ఎకరానికి వేయాలి. లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8 కిలోలు వేయాలి. నివారణ చర్యలు చేపట్టకపోతే తెల్లకంకి వచ్చే అవకాశం అధికంగా ఉంది. ఈ సమయంలోనే గుళికలు తప్పనిసరిగా వేయడం వల్ల పంటను సంరక్షించుకోవడంతో పాటు, దిగుబడులు సాధించుకోవచ్చు. గుళికలు వేయలేని పక్షంలో కార్టప్ హైడ్రోక్లోరైడ్ మందును స్ప్రే చేయవచ్చు.

– సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఏఓ, అంబాజీపేట

ఏటా 1,500 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ మెరమండ్

మామిడికుదురు: విజన్ ఫర్ ఆల్ స్విట్జర్లాండ్ సంస్థ సహకారంతో అంజు ఐ కేర్ ఫౌండేషన్ ద్వారా ఏడాదికి వెయ్యి నుంచి 1,500 మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేస్తున్నామని ఆ దేశానికి చెందిన ప్రముఖ డాక్టర్ ఆండ్రే మెరమండ్ తెలిపారు. మామిడికుదురు అంజు హాస్పిటల్ వద్ద గురువారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని డాక్టర్లు మెరమండ్, తేజ ప్రారంభించారు. ఈ సందర్భంగా మెరమండ్ మాట్లాడుతూ నిరుపేదలకు ఉచితంగా కంటి లోపల అద్దం వేసే పద్ధతిలో కంటి శుక్లం (కేటరాక్ట్, పువ్వు) ఆపరేషన్లను మామిడికుదురులో ప్రారంభించామన్నారు. వృద్ధాప్యంలో వచ్చే లెన్స్ మార్పు వల్ల శుక్లం వస్తుందని, ఆపరేషన్ ద్వారా లెన్స్ అమర్చి, దాన్ని సరి చేయవచ్చన్నారు. ఉచిత ఆపరేషన్ల కోసం స్థానికులు మామిడికుదురు హాస్పిటల్‌లో సంప్రదించాలని సూచించారు. అధునాతన పద్ధతిలో, ఏ విధమైన రుసుము తీసుకోకుండా ఆపరేషన్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు కె.సత్యనారాయణస్వామి, కె.విజయలక్ష్మి, లత, రూహి, మేనేజర్ స్వామి, భరత్, సూర్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల జాతర

సఖినేటిపల్లి: మోరి మహాలక్ష్మమ్మ, కనక మహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలను ఉత్సవ కమిటీ బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించింది. ఈ సందర్భంగా కనక మహాలక్ష్మమ్మకు కల్యాణం, చలిమిడి, పానకాలు బొల్లా ప్రగడ వెంకటరత్నం కుటుంబ సభ్యులు నిర్వహించారు. మహాలక్ష్మమ్మకు లింగోలు వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు చలిమిడి, పానకాలు నివేదన చేశారు. రాత్రి అమ్మవార్లకు చిన్నారులతో కాగడాల నివేదన చేశారు. అనంతరం మోరిపోడుకు చెందిన ఆకుల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జాతర నిర్వహించారు. గరగ నృత్యాలు, బుట్టబొమ్మలు, శక్తి వేషాలు, బాణసంచా కాల్పులు భక్తులను ఆకట్టుకున్నాయి. గురువారం కనక మహాలక్ష్మమ్మను శోభాయమానంగా కడలి వెంకటస్వామి కుటుంబ సభ్యుల సహకారంతో హంస వాహనంపై అశ్వవాహనంలో కొలువుదీర్చి, అమ్మవారికి మోరి, మోరిపోడు గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు.



అమ్మవార్లకు గరగలతో నిర్వహించిన జాతర

వైఎస్సార్ సీపీలోకి చేరిక

మలికిపురం: మండలంలోని గూడపల్లి గుబ్బలపాలెంలో గురువారం స్థానిక వసంత కాలనీ యూనియన్ నాయకులు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరారు. నాయకులు పిచ్చుక బాబ్జీ, గంటా కృష్ణ, కృష్ణమూర్తి, చెవ్వాకుల సుధాకర్, మరికొందరు వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో ఉన్నారు. పార్టీ రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు వీరికి పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఆకర్షితులై పార్టీలోకి చేరినట్టు వారు తెలిపారు.

గొల్లపాలెంలో..

మలికిపురం: మండలంలోని గొల్లపాలెంలో గురువారం పలువురు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరికి రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు వైఎస్సార్ సీపీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జె.కృష్ణకుమారి, రాపాక కమల, కొంబత్తుల వెంకటలక్ష్మి, కె.అనసూయ, గంటా ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, తెన్నేటి ముత్యాలరావు, జె.వెంకటేశ్వరరావు, మరికొందరు ఉన్నారు. రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావును గెలిపిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



గొల్లపాలెంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో గొల్లపల్లి సూర్యారావు

మెట్లు పారదర్శకంగా పని చేయించాలి

ఉపాధి హామీ ఏపీడీ మల్లికార్జునరావు

కొత్తపేట: ఏప్రిల్ ఒకటి నుంచి ఎంజీఎన్ఆర్‌జీఎస్ పనులు ప్రారంభం కానున్నాయని, ఈ నేపథ్యంలో మేట్లు పారదర్శకంగా పని చేయాలని ఉపాధి హామీ ఏపీడీ జీవీకే మల్లికార్జునరావు అన్నారు. మేట్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగింది. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ ఏప్రిల్, మే, జూన్ నెలల్లో 12 వారాల పని దినాలు కల్పిస్తామన్నారు. మేట్లు గ్రామంలో కొలతల ప్రకారం పని చేయించాలన్నారు. పనికి తగ్గ వేతనం మాత్రమే మంజూరు అవుతుందన్నారు. నేషనల్ మొబైల్ మేనేజ్‌మెంట్ సిస్టంలో పనికి రాగానే, మొదట ఫొటో అప్లోడ్ చేయాలన్నారు. అనంతరం నాలుగు గంటల వ్యవధిలో మరో ఫొటో ఓపెన్ చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ మల్లికార్జున్

అప్పుడు మాత్రమే అప్లై అవుతుందన్నారు. ఒకవేళ అటెండెన్స్ పడకపోతే వేతనం లేనట్టేనని స్పష్టం చేశారు. మేట్లు సమగ్రంగా, పారదర్శకంగా పని చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.వాణి, ఏపీడీ సీబీ బీజీ కవిత, ప్లాంటేషన్ మేనేజర్ ఎం.త్రినాథ్, సీఓలు ఫణికుమార్, భారతి, మండల ఫీల్డ్ అసిస్టెంట్లు వాడ ప్రకాష్, చెప్పిడి శ్రీహరి, కోటిపల్లి సత్యనారాయణ కె.శేషగిరిరావు, సీహెచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

రావులపాలెం: వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక అలివేలు మంగా పద్మావతి ఆండాల్ సహిత వేంకటేశ్వరస్వామి ఐదో రోజు గురువారం స్వామి వారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి సుప్రభాత సేవ, సహస్ర నామార్చన తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. స్వామివారిని పల్లకీ ఉత్సవంలో పుర వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధానార్చకుడు వాడపల్లి కమలనాథ్ ఆచార్యులు ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి స్వామివారికి గరుడ వాహనోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ పాలక మండలి చైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి, ఇతర సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక మార్కెట్ రోడ్డు శ్రీనివాసనగర్‌లో ఉన్న అలివేలుమంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి 47వ కల్యాణ మహోత్సవాన్ని గురువారం నిర్వహించారు. లాయర్ వెంకటరెడ్డి, అనంతలక్ష్మి దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించాలి

అయినవిల్లి: ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సీఐ ప్రశాంత్‌కుమార్ అన్నారు. గురువారం కొండుకుదురు గ్రామంలో గ్రామస్తులతో ఆయన సమావేశమయ్యారు. ఎన్నికల నిబంధనలను అందరూ విధిగా పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. వివాదాస్పద వ్యక్తుల వివరాలను తమకు తెలిపితే, కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. ఆయన వెంట ఎస్సై బి.రాజేష్‌కుమార్, ఇతర సిబ్బంది ఉన్నారు. అనంతరం ఎస్ఆర్ఎఫ్ దళాలతో గ్రామంలో కవాతు నిర్వహించారు.

అప్పనపల్లిలో అవగాహన

మామిడికుదురు: శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని నగరం ఎస్సై ఎస్.సురేష్ కోరారు. అప్పనపల్లిలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీల నేతలు ప్రజల్ని రెచ్చగొట్టే విధంగా ప్రకటనలు చేసినా, కవ్వించినా, అటువంటి వారిని ఉపేక్షించేది లేదన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో అనుమతి లేకుండా రాజకీయ పార్టీల పోస్టర్లు అతికించరాదని, బ్యానర్లు ఏర్పాటు చేయకూడదన్నారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలు విధిగా పాటించాలని సూచించారు. అనంతరం పెదపట్నంలంకలో ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు కవాతు నిర్వహించారు.

బీమా చెక్కుల అందజేత

పి.గన్నవరం: పోతవరం గ్రామంలోని ధనవర్ష సహాయ సహకార పొదుపు సంఘంలో సభ్యులైన ఇసుకపూడి గ్రామానికి చెందిన ఇద్దరు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. వారి కుటుంబాలకు మంజూరైన బీమా సొమ్ము రూ.లక్ష వంతున రెండు చెక్కులను సంఘ చైర్మన్ కంకిపాటి ప్రసాద్ గురువారం అందజేశారు.

నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

అయినవిల్లి: ఇంటి పన్నుల వసూళ్లపై అమలాపురం డివిజన్ పంచాయతీ అధికారి బి.రాజు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 31 నాటికి అన్ని గ్రామ పంచాయతీలు నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. ఈఓపీఆర్డీ మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా రాజేశ్వరస్వామి కల్యాణం

అంబాజీపేట: మాచవరం గ్రామంలో ఉన్న పార్వతి రాజేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని గురువారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ నెల 23 వరకూ స్వామివారి కల్యాణ మహోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్టు కార్యనిర్వహణాధికారి, అర్చకులు, గ్రామస్తులు తెలిపారు. ధ్వజారోహణ, గ్రామోత్సవం, పాణి గ్రహణాలు జరిపించారు, 23న సదస్యం, 24న చోరోత్సవం, 25న త్రిశూల స్నానం, 26న స్వామివారి పుష్పోత్సవాన్ని నిర్వహించనున్నారు.

సత్యనారాయణస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

మామిడికుదురు: మాకనపాలెంలోని అనంతలక్ష్మీ, భూదేవీ సమేత సత్యనారాయణస్వామి కల్యాణోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి ఉదయం వ్రతాలు, మొక్కులు, అభిషేకాలు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన పలువురు భక్త దంపతులు స్వామివారి వ్రతాలు ఆచరించారు. స్వామివారిని దర్శించుకున్న పలువురు భక్తులు ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. స్వామివారి కల్యాణోత్సవాలు సోమవారం వరకు ఐదు రోజుల పాటు జరుగుతాయి. స్వామివారి 72వ వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. కల్యాణోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.

ఆర్థిక సాయం అందజేత

మామిడికుదురు: మగటపల్లికి చెందిన నామన ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం తొమ్మిది మంది నిరుపేదలు, దివ్యాంగులకు ఆర్థికసాయం అందించారు. ఒక్కొక్కరికీ రూ.5 వేల వంతున రూ.45 వేలను ఫౌండేషన్ చైర్మన్ నామన రాంబాబు ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ నామన కృష్ణవేణి స్మారకార్థం ఈ సంస్థను ఏర్పాటు చేసి, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు నామన వినోద్, శృతి, తిరుమల సీతామహాలక్ష్మి, మురళి, శ్రీనివాస్, బొలిశెట్టి ఏసుబాబు, జయరామ్, సరెళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజాభిమానంలో

టీడీపీ కూటమి గల్లంతు



వాడపాలెంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- వాడపాలెంలో కాపు, శెట్టిబలిజ నేతలు వైఎస్సార్ సీపీలోకి చేరిక

కొత్తపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ప్రతిఒక్కరూ లబ్ధి పొందారని, ఆ ప్రజాభిమానం గాలిలో టీడీపీ కూటమి కొట్టుకుపోవడం ఖాయమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. వాడపాలెం గ్రామంలో కాపు, శెట్టిబలిజ సామాజిక వర్గాలకు చెందిన జనసేన పార్టీ నాయకులు బండారు చక్రధరరావు (చంటిబాబు), బండారు సందీప్, బండారు వెంకటేశ్వరరావు, బండారు నాగేశ్వరరావు, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి శివకుమార్, దూనబోయిన స్వామి, కొప్పిశెట్టి సాయి ఆ పార్టీకి రాజీనామా చేసి, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసిన జగ్గిరెడ్డి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏనాడూ కనీవినీ ఎరుగని రీతిలో, ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పార్టీరహితంగా, అర్హతే ప్రామాణికంగా పేద, మధ్య తరగతి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. దానితో లబ్ధి పొందిన ప్రజలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తమ గుండెలో పెట్టుకుని అభిమానిస్తున్నారని చెప్పారు. పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, పార్టీ జిల్లా సభ్యుడు బండారు కృష్ణమూర్తి, మండల ఏఏబీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, పార్టీ గ్రామ అధ్యక్షుడు మట్టా బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం

అంబాజీపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యమని పార్టీ నాయకుడు నేలపూడ స్టాలిన్‌బాబు అన్నారు. పార్టీ అమలాపురం పార్లమెంటరీ అభ్యర్థి, ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్‌ను, రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావును వారి స్వగృహం వద్ద స్టాలిన్‌బాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు. దుశ్శాలువా, పూలమాలలతో వరప్రసాద్, సూర్యారావును సత్కరించి, పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు. రాపాక, గొల్లపల్లిని కలిసిన వారిలో నాయకులు మైలా ఆనందరావు, ఓగురి ఆక్రోష్, బీర సురుష్ తదితరులున్నారు.



రాపాక వరప్రసాద్‌ను సత్కరిస్తున్న స్టాలిన్‌బాబు

దళిత పక్షపాతి సీఎం జగన్



ఎంపీ సురేష్‌ను కలిసిన తెన్నేటి కిషోర్

రాజోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితుల పక్షపాతిగా నిలిచారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి తెన్నేటి కిషోర్ అన్నారు. గురువారం ఆయన రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు, బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌ను తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దళితులను అక్కున చేర్చుకుని, రాజ్యాంగపరమైన అనేక ఉన్నత స్థానాల్లో అవకాశాలు కల్పించారన్నారు. అనేక వర్గాలను సామాజికాభివృద్ధి సాధించే దిశగా ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో పోటీ చేసే అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు.

జగన్‌కు అన్ని వర్గాల నుంచి విశేష స్పందన

పార్టీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు



పోతవరంలో ప్రజలతో మాట్లాడుతున్న విప్పర్తి వేణుగోపాలరావు

పి.గన్నవరం: ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని వైఎస్సార్ సీపీ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. పోతవరం గ్రామంలో గురువారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, తనను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచ్ వడలి కొండయ్య, ఎంపీటీసీ పులపర్తి రాజారావు, మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు, పార్టీ నాయకులు గుత్తుల దాసు, సబ్బితి చినబాబు, యాతం గరుడేశ్వరరావు, మోకా సత్యనారాయణ, మానుకొండ వెంకటరమణ, మట్టపర్తి పండు, కోట కుమార్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

కొత్తపేట: ప్రతిఒక్కరూ మొక్కలను సంరక్షించాలని విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేపీ రాజు అన్నారు. గురువారం కళాశాలలో ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అడవుల ప్రాముఖ్యత, వాటిని సంరక్షించవలసిన ఆవశ్యకతపై విద్యార్థులకు వివరించారు. వాతావరణాన్ని సమతుల్యం చేయడంలో అడవులు ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ దీనిని బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, దేవి శిరీష తదితరులు పాల్గొన్నారు.